23.05.2020

**హరి ఇచ్చిన వరము అన్నమయ్య**

106 సంఖ్య : 113 సంపుటము: 2 పుట: 76 రాగం: సాళంగనాట

పల్లవి: సిరిఁ దొడపై నిడి శ్రీనరసింహుఁడు
యిరవుగ వరములనిచ్చీని వాడే

చ. 1: ఘనమగు కోరలు కరాళవదనము
చెనకుచు గొడసెటి జిహ్వాయును
నినిపుఁ గటమరలు నిటలలోచనము
నొనరఁగ గొలువై యున్నాఁడు వాఁడే

చ. 2: చటులచక్రకరంబును శార్ఙరంబును
అటు వరదాభయహస్తములు
పటుతరయోగపు పట్టబంధమును
కటితటి జెలఁగఁగఁ గడఁగీ వాఁడే

చ. 3: పరపగు శేషుని పడగల నీడల
అరుదగు రవిచంద్రాంకముల
సిరులగద్దెపై శ్రీవేంకటేశుడు
పరిపూర్ణుఁడై పరగీ వాఁడే

భావదీపిక:

అన్నమయ్య శ్రీనరసింహునిపై చెప్పిన చక్కని కీర్తన ఇది. స్వామి వర్ణనబట్టి, ఈ స్వామి వెలసిన చోటు తెలియరాకున్నది. పూర్తి వర్ణన నందించిన అన్నమయ్య వూరు ప్రస్తావన తేలేదు. శ్రీలక్ష్మిని తొడపై నుంచుకొనిన శ్రీనరసింహుడు వాడే. ఇక్కడ సుస్థిరుడై అనేక వరములనిచ్చీని, అంటున్నారు పల్లవిలో. ఘనమైన కోరలతో ఈ స్వామి భయంకరమైన మొఖమును కలిగియున్నాడు. అదిమిపట్టి నందువల్ల ఆయన నాలుక నుండి లాలాజలము కారుచున్నది. గొప్ప సంఖ్యలో నున్న దేవతలు, నిటలాక్షుడైన శంకరుడు వినయముగా కొలుచుచుండగా అదిగో వాడే కొలువుదీర్చియున్నాడు. స్వామి ఒకచేత గిరగిరా తిరిగే సుదర్శన చక్రము ధరించియున్నాడు. వేరొకచేత "శార్ఙము" అను ధనస్సును ధరించి యున్నాడు. ఆయన వొక చేయి "వరదహస్తము" (వరములనొసగే చేయిగాను), ఇంకొక చేయి "అభయహస్తము" భయనివారకమగు చేయిగాను ఆయన నడుముపై వున్నవి. నృసింహునికి పరపుగ (మెత్తగా) వుండాలని ఆదిశేషుడు చుట్టలు చుట్టుకొని తన పడగలను గొడుగువలె పట్టుకొని యున్నాడు. ఎక్కడా లేని విధముగా, సూర్య చంద్రులు ఆయన కిరీటముపై అమరియున్నారు. సిరులొలికే గద్దెపై ఆసీనుడైన ఈయనే శ్రీవేంకటేశ్వరుడు. వారే ఇక్కడ పరిపూర్ణుడైన నారసింహుడు.

* చటుల చక్రము = గిరగిరా తిరిగే సుదర్శన చక్రము, * పరిపూర్ణుడు = అన్నియు సమృద్ధిగా నున్నవాడు

Scanned with CamScanner